

'ప్రజాపాలన' కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్



జూబ్లీహిల్స్ వార్డు కార్యాలయానికి వచ్చిన వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం

# ప్రజాపాలనంతా.. గందరగోళమే..

- నియోజకవర్గంలోని 'ప్రజాపాలన' ప్రారంభం
- రేషన్ కార్డుల కోసమే భారీగా డిమాండ్..
- జనంతో కిక్కిరిసిన జీరాక్స్ సెంటర్లు
- సౌకర్యాల కల్పనలో అధికారుల విఫలం..

బంజారాహిల్స్/బన్సీలాల్‌పేట్/బేగంపేట్/అమీర్‌పేట్/ఖైరతాబాద్/హిమాయత్‌నగర్, డిసెంబర్ 28: 'మీకు రేషన్ కార్డు ఉందా.. ఆధార్ కార్డులో అడ్రస్ ఇక్కడే ఉందా.. రేషన్ కార్డు లేకుంటే స్కీమ్స్ రావు.. రేషన్ కార్డు కోసం తెల్లకాగితంలో రాసివ్వండి.. ఒక కుటుంబంలో ఒకటే స్కీమ్ వస్తుంది'' అంటూ 'ప్రజాపాలన' కార్యక్రమంలో దరఖాస్తులు చేసుకునేందుకు వచ్చిన వారికి అధికారులు చుక్కలు చూపించారు. దరఖాస్తులు ఎలా నింపాలో.. రేషన్ కార్డుల కోసం ఎవర్ని అడగాలో తెలియక జనం ఆయోమయానికి గురయ్యారు. ఇదీ మొదటిరోజు ప్రజాపాలన పరిస్థితి.

☛ గురువారం ఖైరతాబాద్ నియోజకవర్గంలోని బంజారాహిల్స్, వెంకటేశ్వరకాలనీ, జూబ్లీహిల్స్, సోమాజిగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్లలో 'ప్రజాపాలన' ప్రారంభమయింది. బంజారాహిల్స్ డివిజన్‌లోని జీహెచ్‌ఎంసీ ట్రైనింగ్ సెంటర్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే దానం నాగేందర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కలిసి 'ప్రజాపాలన' కార్యక్రమం ప్రారంభించారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఎన్నికలకు ముందు గృహలక్ష్మి కింద మంజూరైన 3 వేల ప్రొసీడింగ్ కాపీలను మంత్రికి అందజేశారు. పలు కేంద్రాల వద్ద జనం పెద్ద సంఖ్య లో దరఖాస్తుల కోసం వచ్చారు. అయితే చాలామందికి దరఖాస్తు ఫారమ్స్ అందకపోవడంతో జిరాక్స్ సెంటర్లవద్ద రూ.20 నుంచి రూ.50 డబ్బులు వెచ్చించి ఫారమ్స్ కొనుగోలు చేశారు. దరఖాస్తు ఫారమ్స్ నింపడం ఎలాగో తెలియకపోవడంతో పలుచోట్ల జనం అయోమయానికి గురయ్యారు. రేషన్ కార్డు నంబర్, ఆధార్ నంబర్ దరఖాస్తులో పేర్కొనాలని చెప్పడంతో పాటు జిరాక్స్ కాపీలు పెట్టాలని నిబంధన పెట్టడంతో సమీపంలోని జిరాక్స్ సెంటర్లన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి. పలువురు దరఖాస్తుదారులు జిరాక్స్ సెంటర్లలో లభించే ఆహారభద్రత ఆన్‌లైన్ ఫారమ్స్‌లో వివరాలు నింపి ఇవ్వగా సిబ్బంది వాటిని నిరాకరించారు. కొత్త రేషన్ కార్డు కోసం కేవలం తెల్లకాగితంపై మాత్రమే వివరాలు రాసివ్వాలని సిబ్బంది చెప్పడంతో పలుచోట్ల తీవ్ర గందరగోళానికి దారితీసింది. తెల్లపేపర్ మీద దరఖాస్తులు తీసుకోవడంపై దరఖాస్తుదారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్ ఆయా కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.

☛ ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో ఎక్కువమంది రేషన్‌కార్డుల కోసం కేంద్రాల వద్దకు వచ్చారు.రేషన్ కార్డులో తమ పేర్లు లేవని, కొత్తగా పేర్లు ఎక్కించాలని కొందరు, ఆధార్ కార్డులో ఉన్న చిరునామాలో వేరుగా ఉండడంతో తమకు రేషన్ కార్డులు వస్తాయో లేదో అని పలువురు సిబ్బందితో ఆరా తీయడం కనిపించింది. రేషన్‌కార్డుల దరఖాస్తుల స్వీకరణ కోసం ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని దరఖాస్తుదారులు కోరారు.

☛ బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో కీస్ బ్లాక్స్, చాచానెహ్రూనగర్, ఎవర్‌గ్రీన్ కమ్యూనిటీ హాలు, తుంగభద్ర కమ్యూనిటీ హాలులో నాలుగు కేంద్రాలకు వచ్చే ప్రజల కోసం క్యూలైన్‌లో నిలబడేందుకు బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. జలమండలి జీఎం ప్రభు, డీజీఎం బ్రహ్మారెడ్డి పర్యవేక్షణలో అన్ని కేంద్రాల వద్ద తాగునీటి వసతి కల్పించారు. బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కే.హేమలత అన్ని కేంద్రాలకు వెళ్లి పర్యవేక్షించారు.

☛ బేగంపేట్ సర్కిల్ పరిధిలో జీహెచ్‌ఎంసీ సర్కిల్ అధికారులు దరఖాస్తులను స్వీకరించేందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినప్పటికీ లబ్ధిదారులు అధిక సంఖ్యలో తరలిరావడంతో అవస్థలు పడాల్సి వచ్చింది. బేగంపేట్ సర్కిల్ పరిధిలోని బేగంపేట్, రాంగోపాల్‌పేట్, మోండామార్కెట్, బన్సీలాల్‌పేట్ డివిజన్లలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరించారు. రాంగోపాల్‌పేట్ డివిజన్లోని చుట్టలబస్తీలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాన్ని కార్పొరేటర్ చీర సుచిత్ర సందర్శించి, అధికారుల తీరు పరిశీలించారు.

☛ 'ప్రజాపాలన' కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలకు దరఖాస్తులు స్వీకరించే సనత్‌నగర్ డివిజన్‌లోని శిబిరాలను ఖైరతాబాద్ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ జగన్, ఈఈ ఇందిర గురువారం సందర్శించారు. డివిజన్‌లోని నెహ్రూ పార్క్, దాసారం బస్తీ, అల్లాద్దీన్ కోఠీ, వెల్ఫేర్ సెంటర్‌లలో ఏర్పాటు చేసిన శిబిరాలను వారు సందర్శించారు.

☛ 'ప్రజాపాలన'లో ప్రజల సందేహాలను నివృత్తి చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. గురువారం విఠల్‌వాడి, శంషీర్‌బాగ్, గాంధీకుటీర్, సంజయ్‌గాంధీనగర్‌లో ప్రభుత్వం అమలు చేసే ఆరు గ్యారంటీలకు సంబంధించి 'ప్రజాపాలన'లో దరఖాస్తుల స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు జి.రామన్‌గౌడ్ పాల్గొన్నారు.

☛ లబ్ధిదారుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఏ రోజుకారోజు సర్కిల్ కార్యాలయం అధికారులకు అందజేస్తామని, ఎనిమిది రోజుల పాటు స్వీకరించడం పూర్తయిన తర్వాతనే.. ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నామని అధికారులు వెల్లడించారు.



పాటిగడ్డ మోడల్ మార్కెట్ ప్రజాపాలన సెంటర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

## కన్నులపండువగా అయ్యప్ప పల్లకీ సేవ

బంజారాహిల్స్, డిసెంబర్ 28:ఫిలింనగర్ వినాయక్‌నగర్ పర్వతాంజనేయ స్వామి ఆలయంలో కొలువుతీరిన శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి పల్లకీసేవ గురువారం కన్నులపండువగా నిర్వహించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో పాటు పెద్ద సంఖ్యలో స్వాములు పల్లకీ సేవలో పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ నేతలు నర్సింగరావు, బాబూరావు, రామకృష్ణారెడ్డి, శంకర్, రవినాయక్, వీరేశ్ పాల్గొన్నారు.

## బల్కంపేట ఎల్లమ్మ హుండీ లెక్కింపు

అమీర్‌పేట్, డిసెంబర్ 28: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయ హుండీ లెక్కింపు గురువారం దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ (సికింద్రాబాద్)బి.కృష్ణ పర్యవేక్షణలో జరిగింది. గత 50 రోజుల్లో ఆలయంలోని హుండీల ద్వారా రూ.52,69,671ల ఆదాయం సమకూరింది. దేవాలయ చైర్మన్ సాయిగౌడ్, ఈవో నాగరాజుతో పాటు దేవాలయ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

## పనిచేస్తున్న ఇంట్లో ఆభరణాలు చోరీ?

బంజారాహిల్స్, డిసెంబర్ 28: పనిచేస్తున్న ఇంట్లో ఖరీదైన ఆభరణాలతో ఉడాయించిన మహిళపై బంజారాహిల్స్ పీఎస్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నం 3లోని శ్రీనికేతన్ కాలనీలో నివాసం ఉంటున్న డా.తుహీనాశర్మ రెయిన్‌బో ఆస్పత్రిలో వైద్యురాలిగా పనిచేస్తుంటారు. తన బెడ్‌రూమ్‌లోని కప్‌బోర్డులో పెట్టిన బంగారు గొలుసు, వజ్రాల నెక్లెస్, చెవిరింగులతో పాటు రూ.85 వేల నగదు మాయమైనట్లు బుధవారం గుర్తించిన తుహీనాశర్మ, తన ఇంట్లో పని చేసే లక్ష్మిపైనే మీదనే అనుమానం ఉందంటూ గురువారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## రైల్వే సేవా పురస్కారాల ప్రదానం

బన్సీలాల్‌పేట్, డిసెంబర్ 28: 68వ రైల్వే వారోత్సవాల్లో భాగంగా గురువారం సికింద్రాబాద్‌లోని రైల్ కళారంగ్ ఆడిటోరియంలో విభాగాల వారీగా ప్రతిభ కనబరచిన సిబ్బందికి 'సేవా పురస్కారాలు-2023'డివిజనల్ రైల్వే మేనేజర్ భర్తేశ్ కుమార్ జైన్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు మాలిని జైన్, ఏడీఆర్‌ఎం జి.సుబ్రమణ్యం, రాజీవ్ కుమార్, గోపాల్, ఎస్‌డీపీఓ అభిలాశ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.






## చికిత్స పొందుతూ ఏఎస్ఐ మృతి

బేగంపేట్, డిసెంబర్ 28: రాష్ట్రపతి బందోబస్తు కోసం వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురైన ఏఎస్ఐ ఓ దవాఖానలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. మహంకాళి పోలీస్ ఇన్‌స్పెక్టర్ పరశురాం కథనం ప్రకారం.. సికింద్రాబాద్ మహంకాళి పోలీస్ స్టేషన్‌లో గత ఎనిమిది నెలలుగా ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న నన్యానాయక్ (58) ఈ నెల 18న రాష్ట్రపతి బందోబస్తు కోసమని వెలుతున్నాడు. ఈ క్రమంలో బొల్లారం ఒజోన్ ఆసుపత్రి సమీపంలో బైక్‌పై వెళ్తుండగా వెనకవైపు నుంచి వేగంగా దూసుకువచ్చిన ఓ కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో నన్యా నాయక్ కింద పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పోలీసు అధికారులు సికింద్రాబాద్ యశోద దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మహంకాళి ఏసీపీ రవీందర్, ఇన్‌స్పెక్టర్ పరశురాంలు దవాఖానకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడికి నలుగురు సంతానం. అబ్బాయి, ముగ్గురు అమ్మాయిలు ఉన్నారు. నన్యానాయక్ అంత్యక్రియల కోసం కో ఆపరేటివ్ నుంచి రూ.30 వేలు, సీపీ వెల్ఫేర్ నుంచి రూ.20 వేలు కుటుంబ సభ్యులకు అందజేసినట్టు పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు నల్ల శంకర్‌రెడ్డి వెల్లడించారు.

## ఏఐటీయూసీ సంబురాలు

హిమాయత్‌నగర్, డిసెంబర్ 28: సింగరేణి కాలరీస్ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీ అనుబంధ సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఘనవిజయం సాధించిన సందర్భంగా గురువారం హిమాయత్‌నగర్‌లోని ఎస్‌ఎన్‌రెడ్డి భవన్ వద్ద ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు టపాసులు పేల్చి, మిఠాయిలు పంచిపెట్టి సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యండీ. యూసఫ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్, రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, నాయకులు బి.వెంకటేశం, రత్నాకర్‌రావు, వెంకన్నగౌడ్, టి.నరసింహరెడ్డి, లతీఫ్, వెంకటరాజం తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పీజేఆర్‌కు నివాళి

ఖైరతాబాద్, డిసెంబర్ 28: దివంగత సీఎల్‌పీ నేత, మాజీ ఎమ్మెల్యే పీజేఆర్ వర్ధంతి సందర్భంగా గురువారం ఖైరతాబాద్‌లోని ప్రసాద్ ఐమాక్స్ పక్కనే ఉన్న మైదానంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన చిత్రపటానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయా రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రోహిణ్ రెడ్డి నివాళులర్పించారు.

## బకాయిలు చెల్లించమంటే బెదిరిస్తున్నారు..

ఖైరతాబాద్, డిసెంబర్ 28: ట్రాన్స్‌పోర్టు చేయించుకున్న సరుకుకు సంబంధించిన బకాయిలు చెల్లించమంటే బెదిరింపులకు పాల్పడుతున్నారని కడప జిల్లా పొద్దుటూరుకు చెందిన బాధితుడు మల్లికార్జున్ ఆరోపించాడు. గురువారం మల్లికార్జున్ మాట్లాడుతూ కడప జిల్లాల్లో సాహితీ ట్రాన్స్‌పోర్టు నిర్వహిస్తున్నామని, ఆమోద గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్‌కు చెందిన బెనిట్ సంస్థకు సంబంధించిన ఐరన్ ఓర్‌ను తమ ట్రాన్స్‌పోర్టు ద్వారా కృష్ణాపట్నం పోర్టుకు తరలించామన్నారు. దానికి సంబంధించిన రూ.1.9 కోట్ల బకాయిలు చెల్లించమని సదరు కంపెనీ యజమానులను కోరితే వారు బెదిరింపులు, వేదింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆమోద గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశామని, కాని పట్టించుకోవడం లేదని తెలిపారు.


